బ్యాక్ వాటర్ భయం

• పొలాల్లోకి చేరుతున్న భావనికుంట చెరువు నీరు • ఏటా నష్టపోతున్న రైతులు • తూములు మరమ్మతు చేయాలని వేడుకోలు

సిరిసిల్లఅర్బన్: వర్షాకాలం వచ్చింది అంటే.. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులోని భావనికుంట చెరువు ఆనుకొని ఉన్న రైతులు ఆందోళనకు గురవుతారు. వరదలు వచ్చి చెరువు బ్యాక్ వాటర్‌లో రైతులు సాగు చేసుకుంటున్న పంటలు మునిగిపోతున్నాయి. ప్రతి ఏటా ఇదే పరిస్థితి నెలకొంటుందని దీంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులోని భావనికుంట చెరువు కింది భాగంలో సర్వే నెంబర్ 428, 429తో పలువురు రైతులకు పట్టా భూములున్నాయి. చెరువు కట్టపై మట్టి పోయడంతో ఎత్తు పెరిగి, తూములు సరిగా పనిచేయకపోవడంతో వరదలు వచ్చినప్పుడల్లా ఈ పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. సంబంధింత అధికారులకు సమస్య పరిష్కరించాలని ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెరువు బ్యాక్ వాటర్‌తో మునిగిన పంటలు



మత్తడి దూకుతున్న భావనికుంట చెరువు

పనిచేయని తూములు, కనుమరగవుతున్న కాల్వలు

భావనికుంట చెరువు పెద్దూరు గ్రామానికి ఆనుకొని దాదాపు 9 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గ్రామ పంచాయతీగా ఉన్నపుడు మిషన్ కాకతీయ కింద చెరువులో పూడిక తీసి కట్ట ఎత్తును పెంచారు. దాదాపు ఐదారేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువు పూర్తిస్థాయిలో నిండుకుండల్లా మారుతుంది. అదనంగా వచ్చిన వరద నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన తూములు సరిగా పనిచేయడం లేదు. భామనికుంట చెరువు వరద మత్తడిపై నుంచి కాల్వల ద్వారా మైసమ్మకుంట తద్వారా మానేరు వాగులోకి చేరుకుంటుంది. కాని కొన్ని కాల్వలు మట్టితో నిండిపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో వరద నీరు రోడ్డుపై పారుతూ పంట పొలాల్లోకి చేరుతోందని రైతులు చెబుతున్నారు.

ఏటా పంటలు నీటిపాలు

భావనికుంట చెరువు కింది భాగంలో పలువురు రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. కానీ వర్షాకాలం రాగానే చెరువు పూర్తిగా నిండి దాని బ్యాక్‌వాటర్‌లో చెరువు చుట్టుపక్కల ఉన్న పలువురి రైతులకు చెందిన దాదాపు 30 ఎకరాల వరకు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు మత్తడి తగ్గించి, తూముల మరమ్మతులు చేయాలని, తూము వద్ద మట్టిని తొలగించాలని పలుమార్లు జిల్లా అధికారులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నామమాత్రంగా వచ్చి వెళ్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని అంటున్నారు. మళ్లీ వర్షాకాలం వచ్చిందని, ఎలాంటి నష్టం జరగకముందే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. ఇటీవల చిన్నబోనాలలోని పెద్ద చెరువు గండిపడి వందల ఎకరాల్లో నష్టం వాటిల్లిందని, అలాంటి ఘటన జరగకముందు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంటలు మునుగుతున్నాయి



గ్రామ శివారులోని భావనికుంట చెరువు వెనుకభాగంలో నాకు వ్యవసాయ భూమి ఉంది. వర్షాలు పడి చెరువు నిండి, బ్యాక్ వాటర్‌లో సాగు చేసిన పంట ముంపునకు గురవుతోంది. తూములు పనిచేయక, చెరువు మత్తడి ఎత్తు ఉండడంతో చెరువు నిండినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుంది.

– అతికం నర్సయ్య, రైతు, పెద్దూరు

కాలువల మరమ్మతు చేపట్టాలి



చెరువు వరద నీరు వెళ్లేందుకు వీలులేకుండా కాల్వలను కొందరు మట్టితో కప్పేసి ఆక్రమించుకుంటున్నారు. దీనివల్ల వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తూ పంట పొలాలు, జనావాసాల్లోకి చేరుతుంది. కాల్వను కబ్జా చేసి ఓ ఫంక్షన్ హాల్‌కు చెందిన ప్రహరీ నిర్మించారు. ఇదే అదనుగా భావించి కొందరు కాలువను కబ్జా చేసుకునేందుకు యత్నిస్తున్నారు. చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్‌గౌడ్, పెద్దూరు

అధికారులు దృష్టి సారించాలి



భావనికుంట చెరువును ఆనుకొని మాకు పట్టా భూములు ఉన్నాయి. వర్షాకాలంలో చెరువు నిండినప్పుడల్లా సాగుచేసిన పంటలు మునిగిపోయి, తీవ్రంగా నష్టపోతున్నాం. తూములను మరమ్మతులు చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలి.

– ఉలిసె తిరుపతి, రైతు, పెద్దూరు

క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా

• మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా అని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలో తొలిపొద్దు పర్యటనలో భాగంగా బుధవారం గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు కాకముందు రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేవని, రాష్ట్రం ఏర్పాటై కేసీఆర్ సీఎం అయ్యాక గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయన్నారు. కందికట్కూర్ గ్రామంలో చేయాల్సిన అభివృద్ధి పనులన్నింటికీ నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు పత్తెం తిరుపతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణురావు, సర్పంచ్ ముత్యం అమర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 28 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ మండల అధ్యక్షుడు జక్కుల మహేందర్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ గతంలో కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్మికులు నర్సయ్య, భారతి, లక్ష్మి, రాములు, లింగవ్వ, శంకర్, సాయి, దేవేందర్ పాల్గొన్నారు.

కళాశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ డిమాండ్ చేశారు. కళాశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బాలురకు మరుగుదొడ్లు లేవని, కళాశాల మేయిన్ గేట్ వద్ద ఒర్రెను తలపించేలా వరద నీరు పోతుందన్నారు. బురద నీటిని దాటుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొప్పు ఆదిత్య, బొప్ప సాయిచరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠం



గంభీరావుపేటలో..



తంగళ్లపల్లిలో ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని కోరారు. దీంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఎంపీపీలు వంగ కరుణ, పడిగెల మానస, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆయా గ్రామ సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ సీఏలు, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు. రుద్రంగి గ్రామ పంచాయితీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి బాలింతలు, తల్లులు ఎవరు హాజరు కాకపోవడంతో తూతుమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు.

– సిరిసిల్లటౌన్/చందుర్తి/బోయినపల్లి/కోనరావుపేట/గంభీరావుపేట/తంగళ్లపల్లి/రుద్రంగి

తిరంగ్ ఉత్సవ్





సిరిసిల్లటౌన్/చందుర్తి/రుద్రంగి: తెలుగు తేజం దేశ జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలో తిరంగ్ ఉత్సవ్ పేరుతో వేడుకలు నిర్వహించారు. సిరిసిల్ల వివేకానంద విద్యాలయంలో భారీ జాతీయ పతాకాన్ని విద్యార్థులు ప్రదర్శించి సామూహిక జాతీయ గీతాలాపన చేశారు. కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బుచ్చారావు, మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చందుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయులు విక్రుర్తి లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బోయిన్‌పల్లి తిరుపతి, గుర్రం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రుద్రంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ హనినాథ్ రాజు, కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్ పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి



అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థుల నిరసన

సిరిసిల్లటౌన్: నూతన జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. ఛలో రాజ్‌భవన్ చేపడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. నూతన విద్యావిధానం మూలంగా నిరుపేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అమలుచేస్తున్న విద్యా విధానానికి స్వస్తిపలకాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కుర్ర రాకేశ్, సాయి, చరణ్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి న్యాక్ శిక్షణ కోర్సులు



మాట్లాడుతున్న న్యాక్ ట్రైనింగ్ ఇన్‌చార్జి ప్రకాశ్

ముస్తాబాద్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు న్యాక్ ఆధ్వర్యంలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులను నిర్వహిస్తున్నట్లు న్యాక్ ట్రైనింగ్ ఇన్‌చార్జి గోలి ప్రకాశ్ తెలిపారు. ముస్తాబాద్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్, వెల్డర్, టైలరింగ్, సర్వేయర్ తదితర అంశాలలో మూడు నెలల కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. నిర్మాణ నైపుణ్య అభివృద్ధికి ఇస్తున్న శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ నిపుణులు గంగాధర్, దేవేంద్ర తదితరులున్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఇల్లంతకుంట: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి పంటలో ప్రధానంగా వేరుకుళ్లు, రసం పీల్చే పురుగులు, ఆకుమచ్చ తెగులు ఉధృతి ఎక్కువ ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మదన్‌మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని గాలిపల్లి గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుకుళ్లు ఉన్నట్లయితే బ్లిటాక్స్, కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో పోయాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు లక్షణాలు ఉంటే ప్రొఫికోనజోల్ ఒక మిల్లీలీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితిల్లో తేమ శాతం అధికంగా ఉండటం వల్ల రసం పీల్చే పురుగు నివారణకు ఇమిడాక్లోప్రైడ్ 0.3 మిల్లీలీటర్ లీటర్ నీటికి, అసిఫేట్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చేలల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తీసి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధుకర్ రావు, ఉషారాణి, ఏవో సురేశ్‌రెడ్డి, ఏఈవోలు జ్యోతి, గంగా పాల్గొన్నారు.

చేలల్లో నీటిని కాల్వల ద్వారా తీసేయండి

• కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి చేలను కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ పి.మధుకర్, జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.మదన్‌మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాజేంద్రప్రసాద్ బుధవారం పరిశీలించారు. పత్తి పంటలో వేరుకుళ్లు తెగులు, ఆకుమచ్చ, రసం పీల్చే పురుగు ఉధృతిని గమనించినట్లు తెలిపారు. నివారణకు వాడాల్సిన మందులను రైతులకు సూచించారు. అనంతరం వరిలో వచ్చే మొగి పురుగు లక్షణాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన పురుగు మందులను తెలిపారు. పంట చేలల్లో వర్షానికి నిలిచిన నీటిని కాల్వల ద్వారా తొలగించాలని సూచించారు. వారి వెంట ఎంఏవో ప్రణీత పాల్గొన్నారు.

అసైన్డ్ అక్రమ పట్టాలపై విచారణ చేపట్టాలి



అక్రమ పట్టాలను ప్రదర్శిస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని సేవాలాల్‌తండాలో అసైన్డ్ భూములను అక్రమంగా పట్టాలు చేసుకున్న ఘటనపై కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గిరిజన నాయకులు మున్యానాయక్ బుధవారం డిమాండ్ చేశారు. తండాలో గిరిజనులకు చెందిన 161 సర్వే నెంబర్‌లోని సుమారు ఆరు ఎకరాలను గిరిజనులు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారన్నారు. గ్రామానికి చెందిన ఓ గిరిజన నాయకుడు రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి అక్రమంగా పట్టా చేయించుకున్నారన్నారు. ఇవే భూములను 15 గిరిజన కుటుంబాలు నలభై ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాయన్నారు. 8 నెలల క్రితం అసైన్డ్ కమిటీ తీర్మానం లేకుండానే అధికారులు పట్టా ఎలా చేశారని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న శ్రీలత



రుద్రంగి: స్థానిక తహసీల్దార్‌గా శ్రీలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ తహసీల్దార్‌గా ఉన్న ఆమె బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

'మనబడి' అభివృద్ధి పనులు ప్రారంభం

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడిలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. కిచెన్ షెడ్డు, మరుగుదొడ్లు, హ్యాండ్‌వాష్ షెడ్డులను మన ఊరు మనబడి ద్వారా నిర్మించారని సర్పంచ్ బద్ది కల్యాణి తెలిపారు. ఎంపీటీసీ లలిత, హెచ్‌ఎం యాదగిరి, పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట/బోయినపల్లి: మండలంలోని కొలనూర్, బోయినపల్లి మండలం దేశాయిపల్లి, జగ్గారావుపల్లి వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచులు వెన్నమనేని వంశీకృష్ణరావు ఒంటెల రాజగోపాల్ రెడ్డి,పశువైద్యాధికారులు అంజిరెడ్డి, రమేశ్, అనీల్ కుమార్‌సిబ్బంది పాల్గొన్నారు.

డైరెక్టర్‌కు సత్కారం

వేములవాడరూరల్: ముదిరాజ్ సంఘం జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన రేగుల రాజేశంను ముదిరాజ్ కులస్తులు ఘనంగా సన్మానించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో కులస్తులు శాలువా, పూలమాలతో బుధవారం సత్కరించారు. దేశెట్టి మల్లేశం, రామచంద్రం, గంగాధర్, దండు లక్ష్మయ్య, రాంబాబు, లక్ష్మణ్, పాల్గొన్నారు.

రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాము

వేములవాడ: రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మైలారం రామును రాష్ట్ర రజక సంఘాల సమితి అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ బుధవారం నియమించారు. వేములవాడలో సమితి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. రజకుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం హన్మాండ్లు, దుబ్బ రమేశ్, లింగంపల్లి దేవయ్య, మొగిలి అంజయ్య, సుద్దాల నర్సయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గంభీరావుపేట: శాలివాహన(కుమ్మరి) సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శనిగరం ఆనందం, ఉపాధ్యక్షుడిగా వంగపల్లి రాంచంద్రం, ప్రధానకార్యదర్శిగా మైలారం కృష్ణప్రసాద్, ప్రధాన సలహాదారులుగా శనిగరం సర్వోత్తం, శనిగరం నర్సయ్య, కోశాధికారిగా శనిగరం బాలరాజు ఎన్నికయ్యారు.

నిరుపేద ఎస్సీలకు దళితబంధు ఇవ్వాలి

బోయినపల్లి: మండలంలో నిరుపేద ఎస్సీ కుటుంబాలలో అర్హులైన ప్రతీ ఒక్కరికి దళితబంధు అమలు చేయాలని కోరుతూ బీజేపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జనగం లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చాలామంది కడు పేదరికంలో ఎలాంటి ఉపాధి లేని ఎస్సీ కుటుంబాలు ఉన్నాయని వారందరికీ దళితబంధు నిధులతో ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ ఉదారి నర్సింహచారి పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై శేఖర్‌రెడ్డి

ముస్తాబాద్: సైబర్ నేరాల తీరుపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో సైబర్ నేరాలు జరిగే తీరుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్‌ఫోన్లలో అపరిచిత వ్యక్తులతో మాట్లాడడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో చాటింగ్, మెస్సెజీలు పెట్టడం చేయరాదన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వాట్సాప్ వీడియో కాల్స్ రీసివ్ చేసుకోవద్దన్నారు. అలాగే బ్యాంక్ అకౌంట్ వివరాలు కోరుతూ వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దన్నారు. ఇతరులకు ఓటీపీ చెప్పడం, వివరాలు ఇవ్వడం వంటి పనులు చేయవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు అప్రమత్తంగా వుండాలన్నారు. ప్రత్యేకాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు..

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం సైబర్ క్రైమ్స్‌పై అధికారులు అవగాహన కల్పించారు. బ్యాంక్ అకౌంట్ మోసాలు, టెలిగ్రామ్స్‌లో వచ్చే మెసేజ్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యానికి కృషి



ఆరోగ్య పరీక్షలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో కార్మికుల శ్రమ ఎంతో ముఖ్యమైనదని, కార్మికుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. స్థానిక రైతువేదికలో కార్మికుల ఆరోగ్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఊరురా కార్మికుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీటీసీ మంజుల, కోఆప్షన్ సభ్యుడు షాదుల్, జానబాయి, నర్సింలు, నందు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగు నివారణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి స్రవంతి

ఎల్లారెడ్డిపేట: పిల్లల్లో నులి పురుగులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లితండ్రులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్రవంతి అన్నారు. ఆరోగ్య కేంద్రంలో బుధవారం నులి పురుగు దినోత్సవం ఈ నెల 8న ఉండగా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నులి పురుగు ఉన్న పిల్లల్లో పోషకాహార లోపాలు, రక్తహీనతలతో ఎప్పుడు అలసటగా ఉండడం, శారీరక ఎదుగుదల ఉండదన్నారు. నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను వాడాలన్నారు. ఈ నెల 8న జాతీయ నులిపురుగు దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలకు నులిపురుగు మాత్రలను వేయించాలన్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు వేళాయే

• నేడో, రేపో అధికారిక ప్రకటన

సిరిసిల్లక్రైం: జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు టెండర్లకు సమయం ఆసన్నమైనట్లు ఆబ్కారీశాఖలో నివేదికలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర ఉన్నతాధికారులు 2023–2025 సంవత్సరానికి జిల్లాకు కేటాయించిన మద్యం దుకాణాలు, కులాల వారీగా రిజర్వేషన్‌లు వెల్లడించడంతో జిల్లాలో మద్యం టెండర్ల కోలాహలం సంతరించుకుంది. గత టెండర్ల ప్రక్రియలో ఉన్న 48 మద్యం దుకాణాలకు టెండర్లు జరుగనున్నాయి. ఇందులో రిజర్వేషన్ కింద గౌడకులస్తులకు 9 షాపులు, ఎస్సీలకు 5 షాపులు దక్కనున్నాయి. జిల్లాలో ఏయే షాపులు రిజర్వేషన్ల కోటాకు వెళ్తాయన్న దానికి గురువారం డ్రా తీస్తారని విశ్వసనీయ సమాచారం. అలాగే ఈనెల 4 నుంచి టెండర్ దరఖాస్తులు స్వీకరించి, 21న డ్రా తీసయనున్నట్లు సమాచారం. దరఖాస్తుదారుడు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం మద్యంషాపులు నవంబర్ 30 వరకు నిర్వహణకు అవకాశాలున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.